నియామకం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డివిజన్ యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా పి.శంకర్ యాదవ్ నియమితులయ్యారు. యువ నాయకుడు వర్రీ లలీత్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి యువజన నాయకులు విఘ్నేష్, రాధాకృష్ణ, రాజేంద్రనగర్ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, ముడుమల, చేరుకుల రవి, చంద్రకాంత్, మహేశ్, కార్యదర్శులు నిఖిల్, మనోహర్, మహేశ్, వంశీ, దుర్గ రావు, అన్నెల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు ప్రారంభం

మణికొండ: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా కొనసాగాయి. మొదటి రోజు కావటంతో ఎక్కువ కేంద్రాల వద్ద విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. గండిపేట మండల పరిధిలో మొత్తం 11 కేంద్రాలలో 2562 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా అందులో 2546మంది పరీక్షలకు హాజరయ్యారు. 16 మంది పరీక్షలకు హాజరుకాలేదని ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, ప్రతి కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

పది పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్..

శంషాబాద్: పట్టణంలో పది పరీక్షా కేంద్రాలను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ శశాంక పరిశీలించారు. క్రీడా మైదానంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ నాగమణితో పాటు ఆర్‌జీఐఏ పోలీసులు, మండల విద్యాధికారులున్నారు.



విద్యార్థులు పరీక్ష రాస్తుండగా పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: దేశంలోని 18 ఏళ్లు నిండివారందరికీ రాజ్యాంగం ఓటు అనే ఆయుధాన్ని ఇచ్చిందని ఈ ఓటు హక్కును ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని కళాశాల డీన్ ప్రశాంత్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఇంటెన్సి ఓటర్ అవేర్నెస్ అండ్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని ఓటు అనే ఆయుధంతో మనకు నచ్చిన సరైన వ్యక్తిని పాలకునిగా ఎన్నుకునే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థుల చేత ఓటు హక్కు ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించి ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు సంతోషిని, లావణ్య, వేణుగోపాల్, శ్రీనాథ్, తిరుపతయ్య, కృష్ణవేణి, మమత పాల్గొన్నారు.

తుదిశ్వాస విడిచి.. మరో ఇద్దరికి ఊపిరి

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జొమాటో డెలివరీ బాయ్
- బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించిన కాంటినెంటల్ వైద్యులు
- అవయవదానానికి తల్లిదండ్రుల అంగీకారం
- మరొకరికి విజయవంతంగా లివర్ మార్పిడి చేసిన అదే హాస్పిటల్ వైద్య బృందం

సాక్షి, సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ జొమాటో డెలివరీ బాయ్ ‘అవయవదానం’తో మరో ఇద్దరికి ఊపిరిపోశాడు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన (19) బిశ్వాల్ ప్రభాస్ స్థానిక కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. దీంతోపాటు జొమాటో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీన బిశ్వాల్ యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడగా హుటాహుటినా దగ్గర్లోని కాంటినెంటల్ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు బిశ్వాల్ బ్రెయిన్ డెడ్ అయ్యాడని నిర్ధారించారు. దీంతో డాక్టర్లు అవయవదానం గురించి ప్రభాస్ తల్లిదండ్రులకు వివరించగా వారు ఓ వైపు కొడుకు మరణించాడన్న బాధను దిగమింగుకొని పెద్దమనసుతో అంగీకరించారు. దీంతో డాక్టర్ సెంథిల్ కుమార్ వైద్య బృందం కాంటినెంటల్ హాస్పిటల్‌లోనే ప్రభాస్ నుంచి కాలేయాన్ని సేకరించి సోమవారం మరొకరికి విజయవంతంగా అమర్చారు. అవయవదానంతో ఇతరులకు పునఃజన్మనివ్వడం ఎంతో గొప్ప విషయమని కాంటినెంటల్ హాస్పిటల్స్ వైద్య బృందం తెలిపింది. ఈ సందర్భంగా బిశ్వాల్ ప్రభాస్‌కు హాస్పిటల్ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు.



బిశ్వాల్ ప్రభాస్ (ఫైల్)

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



ఆహ్వాన పత్రిక, బ్రోచర్‌ను విడుదల చేస్తున్న గడ్డం ప్రసాద్ కుమార్, ఉత్సవ సమితి ప్రతినిధులు

రాజేంద్రనగర్: డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఏప్రిల్ 5న రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆరాంఘర్ చౌరస్తాలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు వైభవంగా జరుగనున్నాయి. ఈ వేడుకలను పురస్కరించుకొని స్పీకర్ ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా ఆహ్వాన పత్రిక, బ్రోచర్‌ను విడుదల చేసి మొదటి ఆహ్వానాన్ని జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి కార్యక్రమం అధికారికంగా నిర్వహిస్తుందని..అందుకు అన్ని ఏర్పాట్లు చేయడంలో ముందుంటుందన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు పోయిల జీవన్ దాస్‌జీ, అధ్యక్షులు టి.ఆర్.శ్రీరాములు, గోల్కొండ రాజు కుమార్, పంబాల రాజు, పలుగు చెరువు మహేశ్, ప్రస్తుత అధ్యక్షులు పచ్చ నర్సింగ్, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి రగడంపల్లి శ్రావణ్, కోరని దయానంద్, జాన్‌పాల్, బాబురావు, గోల్కొండ ఉపేందర్, ఎడ్లకాడి చంద్రశేఖర్, బర్ల సుమన్, కవ్వగూడెం గౌతమ్, జంగయ్య, సంజీవ, బచ్చల మహేశ్, ప్రీతమ్ రాజ్, గుంటి రాజ్ కుమార్, బలరాం, రమేశ్, బండారి సుదర్శన్ పాల్గొన్నారు.

చలివేంద్రాలతో ప్రజలకు మేలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

మణికొండ: వేసవి కాలంలో ప్రయాణించే బాటసారులకు చలివేంద్రాలు ఎంతో మేలు చేస్తాయని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మణికొండ మున్సిపాలిటీ కేంద్రం హనుమాన్‌నగర్ కాలనీ ప్రవేశంలో మాంగల్యం ఫౌండేషన్ చైర్‌పర్సన్ కీర్తిలత గౌడ్ తన జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో సేవా సంస్థలు ప్రతి కూడలిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ ఫర్ యు కార్యదర్శి సీతారాందాస్, నాయకులు డాక్టర్ ప్రభావతి, శివగంగ, లక్ష్మణ్‌రావు, లక్ష్మీనారాయణ, విష్ణు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగింపు



అత్తాపూర్: పార్లమెంటు ఎలక్షన్ కోడ్ వచ్చిన దరిమిలా ప్రధాన కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో తమ గృహాలపై ఎలాంటి రాజకీయపరమైన పోస్టర్లు గానీ..మతపరమైన ఫ్లెక్సీలు కానీ ఏర్పాటు చేసుకోవడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కె.రవి కుమార్ తెలిపారు. ఈ మేరకు సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, అత్తాపూర్ కార్పొరేటర్ డివిజన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలు, పోస్టర్లను జీహెచ్‌ఎంసీ సిబ్బంది సోమవారం తొలగించారు. ఎన్నికల గడువు ముగిసే వరకు ప్రజలకు ప్రాంతాలకు పార్టీలకు ఇబ్బందులు కలుగకుండా ప్రజలు, నాయకులు సహకరించాలని రవి కుమార్ విజ్ఞప్తి చేశారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయం



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల గడ్డంపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉప్పర్‌పల్లి సామ భూపాల్‌రెడ్డి గార్డెన్‌లో ఆదివారం అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ విస్తృత కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరై కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని బీజేపీ బలంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చి హామీలన్నీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదన్నారు. బీజేపీ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కలుగుతుందన్నారు. అదే విధంగా చేవెళ్ల పార్లమెంటు బీజేపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని..ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కార్యకర్తలు శ్రమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నప్పటికీ.. రాష్ట్రంలో వాటిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్ రాజ్, వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి, బొక్క వేణుగోపాల్, అంజన్ కుమార్, కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, నంద కిశోర్, బాబురావు పాల్గొన్నారు.

జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షలు



జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అశోక్‌యాదవ్

మణికొండ: రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి కో ఆపరేటీవ్ ఫెడరేషన్ చైర్మన్‌గా బొర్ర జ్ఞానేశ్వర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించటంతో ఆయనకు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు వెళ్లి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్‌యాదవ్ మాట్లాడుతూ ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కిషన్, గండయ్య, డి.ప్రణయ్, రాము, డి.కిరణ్, వెంకటేశ్, నరేందర్ పాల్గొన్నారు.

జితేందర్‌రెడ్డికి సన్మానం

మణికొండ: బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా, రాష్ట్ర ప్రభుత్వానికి క్రీడా సలహాదారుడిగా నియమితులైన మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్, నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ మాజీ సర్పంచ్ గండయ్యతో పాటు నాయకులు ఆయనను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా రంగంలో రాష్ట్రం వెనకబడి ఉందని, దాన్ని అగ్రభాగానికి తెచ్చేలా కృషి చేయాలని కోరామని కిషన్ తెలిపారు.



జితేందర్‌రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న కొండా దంపతులు

శంషాబాద్: రామాంజపూర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జరిగిన కల్యాణోత్సవ వేడుకల్లో బీజేపీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సంగీతారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేవెళ్లలో బీజేపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆయన పేర్కొ న్నారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, సర్పంచ్ కొప్పుల నర్సమ్మ, ప్రభాకర్, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఔటర్‌పై కారు బోల్తా



శంషాబాద్: ఔటర్‌పై కారు బోల్తా పడి ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. చిన్న గోల్కొండ సమీపంలో ఔట ర్ వద్ద కూకట్‌పల్లి నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాల్యాయయి. చికిత్స నిమిత్తం వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కారును అక్కడి నుంచి తొలగించారు.

విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



మల్కారంలో ఏర్పాటు చేసిన శిబిరంలో విద్యార్థులు, అధికారులు

ఏజీవర్సిటీ: విద్యార్థులు చదువుతో పాటు విద్యార్థి దశలోనే సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఉద్యాన కళాశాల నిపుణుడు యూజీ అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ కే. కళాధర్ బాబు అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా శంషాబాద్ మండల పరిధిలోని మల్కారం గ్రామంలో వారం రోజుల పాటు ప్రత్యేక శిబిరాని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కళాధర్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు గ్రామంలో చేసే సేవా కార్యక్రమాలు సామాజిక చైతన్యం, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరం, క్షేత్రస్థాయి ప్రదర్శన, పంటలపై చీడ పీడల యాజమాన్యంపై పలు కార్యక్రమాలు చేపడుతారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఇంటింటికీ తిరిగి గ్రామ సర్వే నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాని ఏర్పాటు చేస్తునందుకు గ్రామస్తులు, గ్రామ ప్రత్యేకాధికారి కళాశాల యాజమాన్యానికి, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి సూర్యానారాయణ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జులు సంతోషిని, లావణ్య, వలంటీర్లు దుర్గాప్రసాద్, జనార్దన్, అక్షయ, అమిత్, అఖిల, ఆర్తి, నితిన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోనల్ స్పోర్ట్స్ మీట్



జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న విద్యార్థులు



రాజేంద్రనగర్: పిల్లలను నిత్యం గంట పాటైన ఆటలు ఆడించాలని భాష్యం స్కూల్ సీఈఓ చైతన్య అన్నారు. సోమవారం భాష్యం విద్యా సంస్థల జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో అత్తాపూర్ భాష్యం స్కూల్‌కు చెందిన 3, 4, 5వ తరగతుల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. త్రో బాల్‌లో 3వ తరగతి విద్యార్థిని మొదటి బహుమతి గెలుచుకుంది. హర్డిల్ రిలే రేస్‌లో 5వ తరగతి విద్యార్థులు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. అలాగే రన్నింగ్ రేసులో 3వ తరగతి విద్యార్థిని ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. భాష్యం స్కూల్స్ సీఈఓ చైతన్య, జేఈఓ అంకమ్మరావు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అలాగే ప్రిన్సిపాల్ అయూబ్ భాషా, వైస్ ప్రిన్సిపాల్ లౌక్య విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

మహిళాశక్తి అవార్డుల ప్రదానం



నిర్వాహకులతో మహిళా శక్తి అవార్డులు పొందిన వారు

రాయదుర్గం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సాధికారత కోసం పనిచేస్తున్న ప్రఖ్యాత సంస్థ ఉమెనార్జీ తెలంగాణ మహిళా అవార్డుల వేడుకను గచ్చిబౌలిలోని నిథమ్ ప్రాంగణంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఇందులో భాగంగా విమెనర్జీ, వీఏయిమ్, ఇతర ప్రధాన 30 సంస్థలతో కలిసి యునైటెడ్ తెలంగాణ లోకల్ ఉమెన్స్ అసోసియేషన్ ఫ్రంట్(యూటీఎల్‌డబ్ల్యూఏఎఫ్)ను ఏర్పాటు చేశారు. అనంతరం నూతన సంస్థ లోగోను కూడా ఆవిష్కరించారు. అపోలో ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి, కాంటినెంటల్ ఆస్పత్రి వైస్‌చైర్మన్, డయాబెటిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ అనురాధారెడ్డి, అగ్రి ఇండస్ట్రీయలిస్ట్ సుధారెడ్డితో కలిసి 300 మంది వివిధ రంగాలకు చెందిన మహిళలకు మహిళా శక్తి అవార్డులను ప్రదానం చేశారు.యూటీఎల్‌డబ్ల్యూఏఎఫ్ వ్యవస్థాపకురాలు దీప్తిరెడ్డి మాడుగుల మాట్లాడుతూ స్థానికేత పెట్టుబడిదారులు స్థానిక వనరులను అన్యాయంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ మహిళలు వారి సొంత ఎంఎస్‌ఎంఈ అవకాశాలను ఎలా కోల్పోతున్నారో వివరించారు. స్థానిక జీవనోపాధికి ఉద్దేశించిన గ్రాంట్లు, నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్ రామాచారికి

అరుదైన అవకాశం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డీబి రామాచారి కి అరుదైన గౌరవం దక్కింది. టెట్రాహెడ్రాన్ అండ్ టెట్రాహెడ్రాన్ లెటర్స్ ఎడిటోరియల్ బోర్డులో చేరేందుకు అవకాశం కల్పించారు. ఆయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలోని క్యాటలిసిస్ లేబోరేటరీలో ప్రొఫెసర్‌గా విధులను నిర్వహిస్తున్నారు. ప్రతిష్టాత్మక ఆర్గానిక్ కెమిస్ట్రీ జర్నల్స్ అనేవి ఆర్గానిక్ కెమిస్ట్రీ రంగంలో విభాగాలు, ప్రపంచవ్యాప్తంగా పూర్తి అసలైన పరిశోధనా పత్రాలను వేగంగా ప్రచురించడానికి అంతర్జాతీయ జర్నల్‌లుగా 1959 నుంచి గుర్తింపు పొందాయి. కాగా ప్రొఫెసర్ రామాచారి 115 కంటే ఎక్కువ ప్రచురణలను కలిగి ఉండడం విశేషం. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బెంగళూరులోని ఫెలో వంటి ఇతర అవార్డులు, గుర్తింపు కూడా పొందారు.ఆయన అనేక అవార్డులతో పాటు 2014లో హెచ్‌సీయూ చాన్స్‌లర్స్ అవార్డును కూడా సాధించారు. 22 మంది పీహెచ్‌డీలకు మార్గనిర్దేశం చేయడం విశేషం. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ఆసుపత్రికి నీటి ట్యాంకర్లు పంపాలి



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి నీటి ట్యాంకర్లు పంపాలని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్‌ఉల్లా అన్నారు. సోమవారం ఆయన జలమండలి గోల్కొండ మేనేజర్ సాజిద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి కార్వాన్ నియోజకవర్గంలోనే అతిపెద్ద ఆసుపత్రి అని, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ వార్డులు ఉన్నాయని, ప్రతినిత్యం శాస్త్ర చికిత్సలు జరుగుతాయని ఈ కారణంగా తమకు నీరు ఎంతో అవసరమని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతినిత్యం సుమారు వెయ్యి మంది ఔట్ పేషంట్లు, వంద పడకల సామర్థ్యం గల ఇన్ పేషంట్ విభాగం, వంద శాతం ఆక్యూపెన్సీతో ఈ వార్డు ఉంటుందని ఈ కారణంగా తమకు ప్రతినిత్యం వందలాది లీటర్ల నీరు అవవసరమని ఆయన అన్నారు. మరోవైపు ఆసుపత్రి ఆర్‌ఎంవో వినాయక్‌రావు, ఏవో శ్రీనివాస్‌రావు కార్వాన్ ఎమ్మెల్యేను కలిసి తమకు నీటి ట్యాంకర్లు రావడం లేదని ఈ విషయంపై చొరవ చూపాలని కోరుతూ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి నీటి ట్యాంకర్లు సరఫరా అయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఆయనను కలవడానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే దానిపై స్పందించి తాను పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి కార్వాన్‌లో తన దృష్టికి రాలేదన్నారు. వేసవి రాకముందే జలమండలి అధికారులతో పలు మార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించి నీటి సరఫరాలో ఎటువంటి అవాంతరాలు, కోతలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.